క్లుప్తంగా

నియామకం



కాటారం: బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా మండలంలోని విలాసాగర్‌కు చెందిన పూసాల రాజేంద్ర ప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ ఆదివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. బీసీ కులాలను చైతన్య పరుస్తూ బీజేపీ గొప్పతనాన్ని ప్రజలకు తెలియజేస్తూ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు సూచించారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడితో పాటు బీజేపీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు నిశిధర్‌రెడ్డికి రాజేంద్రప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

అవార్డుకు ఎంపిక



మల్హర్: మండలంలోని అన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన భరత నాట్య వర్ధమాన కళాకారిని కుమారి అలకానంద రాథోడ్ నాట్య మయూరి అవార్డుకు ఎంపికయింది. ఈ మేరకు ఎక్స్–రే లీటరరీ కల్చరల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో విజయవాడలో నేడు(సోమవారం) నిర్వహించే మదర్ థేరిస్సా జయంతి సందర్భంగా మదర్ థేరిస్సా అవార్డు వేడుకల్లో అలకానంద రాథోడ్ నృత్య ప్రదర్శనని ప్రదర్శించనున్నారు. అనంతరం ప్రముఖుల చేతుల మీదుగా నాట్య మయూరి అవార్డుని అందుకుంటుందని ఆమె తల్లిదండ్రులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు కృష్ణాష్టమి వేడుకలు

కాటారం: అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో నేడు(సోమవారం) మండల కేంద్రంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక భక్తాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమం ఉంటుందన్నారు. అలాగే అన్నదానం ఉంటుందని తెలిపారు. యాదవ కులస్తులు, యువత, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత



టేకుమట్ల: మండలంలోని ఆశిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఇచ్చంతుల కృష్ణ సెల్ ఫోన్‌ను ఇటీవల పోగొట్టుకున్నాడు. దీంతో అతడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్సై జి.ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీస్ టెక్ టీం సిబ్బంది లత, లవకుమార్ సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్ గుర్తించారు. ఈ మేరకు బాధితుడు కృష్ణకు ఆదివా ఎస్సై అందజేశారు.

జనావాసాల్లోకి కొండచిలువ



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం మజీద్‌పల్లి వద్ద జనావాసాల్లోకి కొండచిలువ సంచరించింది. ఆదివారం రాత్రి కొండ చిలువ స్థానిక గుండం చెరువుగుండా రోడ్డుపైకి రావడంతో భక్తులు, స్థానికులు భయాందోళనకు గురయ్యారు. దీంతో కొంత మంది యువకులు కొండచిలువను హతమార్చారు.

గుండె పోటుతో లారీ డ్రైవర్ మృతి



రమేశ్ మృతదేహం

వెంకటాపురం(కె): గుండె పోటుతో లారీ డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కొండాపురం గ్రామ శివారుల్లో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. నల్లగొండ జిల్లా మునుగోడు మండలం వెలమ్మకంటి గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ కొంక రమేశ్(39) శనివారం మండల పరిధిలోని ఓంటి చింతలగూడెం ఇసుక ర్యాంప్‌లో ఇసుక లోడింగ్‌కు వచ్చాడని తెలిపారు. ఇసుక లోడ్ చేసుకోని తిరిగి వెళ్తున్న క్రమంలో కొండాపురం గ్రామ శివారుల్లో రమేశ్‌కు సా యంత్రం 6 గంటల సమయంలో ఆకస్మత్తుగా గుండె నొప్పి రావటంతో లారీని రోడ్డు పక్కకు ఆపాడని తెలిపారు. గుండె కొప్పి ఎక్కువ కావటంతో డ్రైవర్ సీట్‌లోనే కూర్చోని మృతి చెంది నట్లు తెలిపారు. ఆదివారం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి రావు తెలిపారు.

పదవి కోసం ప్రయత్నాలు

- సర్పంచ్ కావాలని కొందరి ఆరాటం
- అదే అదునుగా సొమ్ము చేసుకుంటున్న మరికొందరు



గోవిందరావుపేట పంచాయతీ కార్యాలయం

గోవిందరావుపేట: పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడకముందే కొన్ని గ్రామాల్లో రా జకీయం రసవత్తరంగా మారుతోంది. ఆశావహులు ప్రయత్నాలు ప్రారంభించారు. ఎలాగైనా సర్పంచ్ కావాలని పట్టుబిగిస్తున్నారు. కాస్తో కూస్తో పలుకుబడి ఉన్న నేతల ద్వారా పావులు కదుపుతున్నారు. ఈక్రమంలో వారి ఆశలను కొందరు క్యాష్‌గా మలుచుకుంటున్నారు. ఈసారి సీటు పక్కా అంటూ.. మందు, విందు కోసం ఖర్చు పెట్టిస్తున్నారు.

మధ్యవర్తుల హవా..

సర్పంచ్ ఆశావహులను ఆసరాగా చేసుకున్న కొందరు మధ్యవర్తులుగా ఉంటూ బడా నేతల వద్దకు తీసుకెళ్తున్నారు. 'మనోడే.. మంచోడు. ఈసారి టికెట్ ఆశిస్తున్నాడు. మీ దీవెన ఉండాలి' అంటూ పరిచయం చేస్తూ.. నమ్మకం కల్పిస్తున్నారు. ఈక్రమంలో ఉదయం నుంచి రాత్రి వరకు ఆశావహులు రింగ్ రాజాల (మధ్యవర్తుల)చుట్టూ తిరుగుతూ వారి రోజువారీ ఖర్చులు భరిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో వారికి సేవలు చేస్తున్నారు. మధ్యవర్తులు మాత్రం మందు పార్టీలు ఏర్పాటు చేయించుకుని, డబ్బులు ఖర్చు చేయిస్తూ మైండ్ గేమ్ ఆడుతున్నారు.

ఏకగ్రీవమే అధికం..

మండలంలో 18 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇప్పటివరకు జరిగిన ఎలక్షన్లో ఒక మచ్చాపూర్ తప్ప మిగతా గ్రామాల్లో సర్పంచ్ పదవి ఎస్టీ రిజర్వ్ అయ్యి ఉంది. ఎస్టీలో 32 తెగలు ఉన్నా.. ఎక్కువగా లంబాడీ, నాయక్ పోడ్, కోయ తెగల నుంచే రాజకీయాల్లో రాణిస్తున్నారు. వీరిలో చదువుకున్న వారిని, సమాజంపై అవగాహన ఉన్న వారిని ఎంచుకుని అన్ని పార్టీలు మద్దతు పలుకుతాయని, దాదాపు ఏకగ్రీవంగా ఎన్నుకున్న ఘటనలే అధికం. కానీ ప్రస్తుతం పలు గ్రామాల్లో రాజకీయం భిన్నంగా మారింది. ప్రస్తుతం ఏకగ్రీవం అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్న కూడా అన్ని తెగల వారు ప్రయత్నాలు చేస్తున్నారు. సర్పంచ్ పదవి కోసం ఎంత వరకు ఐనా ఖర్చు పెట్టుకోవడానికి ఆశావహులు సిద్ధంగా ఉన్నారు.

ప్రజల మధ్య ఉన్న వారికే టికెట్



కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ వారికే గుర్తింపు ఉంటుంది. పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు పార్టీని వీడకుండా పని చేసిన వారిని, ప్రజల కష్ట, సుఖంలో తోడుగా ఉన్న నాయకులకే పార్టీ టికెట్ ఇచ్చి గెలిపించుకుంటుంది. రాజకీయ మధ్యవర్తుల మాటలు నమ్మి మోసపోవద్దు. స్థానిక ఎన్నికల్లో రాష్ట్ర మంత్రి సీతక్కదే తుది నిర్ణయం.

– పైడాకుల అశోక్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు

మధ్యవర్తుల ట్రాప్‌లో పడకండి..



స్థానిక ఎన్నికలు సమీపిస్తున్నందున చాలా మంది గ్రామాలల్లో ఆశావాదులు ఉంటారు. కొంత మంది మధ్యవర్తులు అధిష్టానంతో మాట్లాడి సర్పంచ్ టికెట్ ఇప్పిస్తామని ఆశచూపి డబ్బులు వసూలు చేస్తారు. కష్టపడి, ప్రజల సమస్యలు తెలిసి, తీర్చే వారికే, ప్రజల్లో గుర్తింపు ఉన్న వారికే పార్టీ టికెట్ ఇస్తుంది.

–లక్ష్మణరావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు

ప్రజల కోసం పనిచేసే వారికే..



రాజకీయ అవగాహన లేని వారే మధ్యవర్తులను నమ్ముకుంటారు. పార్టీ కోసం, ప్రజల కోసం పని చేసే వారికే బీజేపీ టికెట్ ఇస్తుంది. బీజేపీ అంటేనే క్రమశిక్షణ గల పార్టీ. క్రమశిక్షణ గల అభ్యర్థికి, కష్టపడే అభ్యర్థికి, ప్రజా సమస్యలను తీర్చగల అభ్యర్థిని మాత్రమే పార్టీ గుర్తించి స్థానిక ఎన్నికల్లో టికెట్ ఇస్తుంది.

– బలరాం, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలు



ఉట్టి కొడుతున్న విద్యార్థులు

మంగపేట: మండలకేంద్రంలోని శ్రీ వైష్ణవి పాఠశాలలో ప్రిన్సిపాల్ రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ముందస్తు శ్రీ కృష్ణాష్టమి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలోని విద్యార్థులతో కలిసి శ్రీ కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణతో అలరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఉట్టికొట్టే కార్యక్రమంలో ఎంతో ఉత్సాహంతో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల టీచర్స్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

మంగపేట: మండలంలోని తిమ్మంపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1986–87 సంవత్సరంలో పదోతరగతి చదువుకున్న విద్యార్థుల ఆదివారం సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. 37 సంవత్సరాల క్రితం కలిసి చదువుకున్న పాఠశాలలో అందరూ ఒకేచోట కలుసుకుని ఆప్యాయంగా పలుకరించుకుని అలింగణం చేసుకున్నారు. వారి వారి యోగక్షేమాలను తెలుసుకుని చదువుకున్న నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని బావోద్వేగానికి లోనయ్యారు. చదువు నేర్పిన గురువులు ఎండి.అఫ్జల్, చంద్రమౌళి, దిడ్డి కాశీనాధంను శాలువాతో ఘనంగా సన్మానించారు. పాఠశాలకు రూ.40 వేల విలువైన సౌండ్ సిస్టం బహూకరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చిన్నాల చక్రాధర్ రావు, గొప్ప సమ్మారావుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల ఆశయాలను కొనసాగించాలి



మాట్లాడుతున్న ఈర్ల సాగర్

ములుగు: మహనీయుల ఆశయాలను కొనసాగిస్తూ, భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బహుజన వికాస్‌వేదిక జిల్లా చైర్మన్ ఈర్ల సాగర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రిటైర్డ్ ఉద్యోగుల భవన్‌లో ఆదివారం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోల్కొండ బుచ్చన్న అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి సాగర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బహుజనవికాస్ వేదిక సామాజిక చైతన్య కార్యక్రమాలను నిర్వహించుకుంటూ సమాజాన్ని మేల్కొలిపే బాధ్యతాయుతమైన వ్యవస్థ నిర్మాణం లక్ష్యంగా ముందుకుసాగుతుందని అన్నారు. అనంతరం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా మోతె రమేశ్, ప్రధాన కార్యదర్శిగా రాగుల శంకర్‌ను ఎన్నుకున్నట్లు సాగర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల జేఏసీ జిల్లా అధ్యక్షుడు ముంజాల భిక్షపతిగౌడ్, సంఘం ఉపాధ్యక్షుడు గద్దల రాజేందర్, కోశాధికారి అన్నాడి అశోక్, పాలెపాక యాకయ్య, రవీందర్, ఐలయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నర్సింగరావుకు ఘన నివాళి



ములుగు: నర్సింగరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



ములుగు రూరల్: రాయినిగూడెంలో..

ములుగు: తుడుందెబ్బ రాష్ట్ర వ్యవస్థాపకుడు దబ్బగట్ల నర్సింగరావు భౌతికంగా మన మధ్యలో లేకపోయినా ప్రజల మనసుల్లో బతికే ఉంటారని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బాదం ప్రవీణ్‌కుమార్, ప్రజాసంఘాల జేఏసీ జిల్లా అధ్యక్షుడు ముంజాల భిక్షపతిగౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రిటైర్డ్ ఉద్యోగుల భవన్‌లో ప్రైవేట్ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు వినుకొండ విశ్వకుమార్ అధ్యక్షతన ఆదివారం నర్సింగరావు వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింగరావు చిత్రపటానికి పూల మాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆదివాసీల అస్తిత్వం కోసం హక్కుల కోసం ఎన్నో పోరాటాలు చేసిన గొప్పవ్యక్తి నర్సింగరావు అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల యూత్ ప్రెసిడెంట్ బండి మధు, వర్కింగ్ ప్రెసిడెంట్ కుక్కల నాగరాజు, నాయకులు శంకరయ్య, జిల్లా కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు బుచ్చన్న, రాగుల శంకర్, రమేశ్, రాజేందర్ పాల్గొన్నారు.

ములుగు రూరల్: తుడుందెబ్బ వ్యవస్థాపక అధ్యక్షుడు దబ్బగట్ల నర్సింగరావు వర్ధంతిని మండలంలోని రాయినిగూడెంలో నిర్వహించారు. ఈ మేరకు ఆదివారం తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు వజ్జ రాజు ఆధ్వర్యంలో నర్సింగరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీ హక్కుల సాధన కోసం జాతిని ఐక్యం చేసిన గొప్పమహనీయుడు నర్సింగరావు అన్నారు. దబ్బగల్ల సమ్మక్క, తవిటి నారాయణ, రాజేష్, మాజీ సర్పంచ్ స్వామి, దేవేందర్‌రావు, నవీన్, ఓదెలు, వెంకటేశ్వర్లు, రాజన్న, లక్ష్మీ, రజిత, కన్నక్క, రాజు, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు చేపట్టాలి



మాట్లాడుతున్న చింత క్రాంతి

గోవిందరావుపేట: పార్టీ యూత్ సభ్యత్వ నమోదులను చేపట్టాలని కాంగ్రెస్ యూత్ మండల అధ్యక్షుడు క్రాంతి తెలిపారు. మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ ఎన్నికల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రాంతి మాట్లాడుతూ.. జిల్లా యూత్ అధ్యక్షుడిగా ఇస్సర్ ఖాన్‌ని, నియోజకవర్గ అధ్యక్షుడిగా మారం సుమన్‌రెడ్డిని, జిల్లా ప్రధాన కార్యదర్శిగా అరుణ్ లాల్‌ని, రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శిగా ఆశ్విన్ రాథోడ్‌లకు మండల యువతి, యువకులు ఓటు వేసి గెలిపించాలని కోరారు. యూత్ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కు రేవంత్, నియోజకవర్గ కార్యదర్శి గొంది కిరణ్, మండల ఉపాధ్యక్షుడు కొరం రామ్మోహన్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జక్కు రణదీప్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

శాయంపేట : మండలంలోని మాందారిపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అల్లం శంకర్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా ఆదివారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు శంకర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం శంకర్ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, నాయకులు చిందం రవి, నిమ్మల రమేశ్, రేణికుంట్ల సదయ్య, జిన్నా రాజేందర్, సాదు నాగరాజు, మారెపల్లి కట్టయ్య, వలిహైదర్, సదానందం తదితరులు ఉన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ బోనాలు



వాజేడు: వాజేడులో బోనాలను తీసుకెళ్తున్న మహిళలు



వాజేడు: పెద్ద గొల్లగుడెంలో..

వాజేడు: మండల పరిధిలోని వాజేడు, గుమ్మడి దొడ్డి, పెద్ద గొల్లగూడెం గ్రామాలకు చెందిన భక్తులు ఆదివారం ముత్యాలమ్మకు బోనాలను సమర్పించారు. గ్రామంలోని ప్రతీ ఇంటి నుంచి మడి, ఉపవాసంతో భోనమెత్తిన మహిళలు భారీ ఎత్తుకుని అమ్మవారి ఆలయాల వద్దకు తరలివెళ్లారు. తల్లి చల్లంగ చూడమంటూ, పంటలు పండాలని, ఆరోగ్యాలు మంచిగా ఉండాలని కోరుతూ అమ్మవారికి బోనాలను సమర్పించారు. ముత్యాలమ్మ అమ్మవారితో పాటు గ్రామ దేవతలకు పూజలు చేశారు.

వెంకటాపురం(కె): మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని శివాపురం, పెరిక వీధి, నాయకుల గూడెం గ్రామస్తులు ముత్యాలమ్మ బోనాల పండుగా ఘనంగా నిర్వహించారు. ముత్యాలమ్మకు బోనాలను ఎత్తుకోని ఊరేగింపుగా గుడికి వెళ్లి బోనాలు సమర్పించారు. అనంతరం పాడిపంటలు చల్లగా కాపాడమని కోరుతూ మొక్కులను చెల్లించుకున్నారు.

ఏటూరునాగారం: మండల కేంద్రంలో ఆదివారం గ్రామస్తులు పోచమ్మలకు ఘనంగా బోనాలు సమర్పించారు. మహిళలు ప్రతీ ఇంటి నుంచి బెల్లం పాయసంతో ప్రత్యేకంగా తయారు చేసిన బోనాలు నెత్తిన పెట్టుకుని, డప్పుచప్పుళ్లతో శివసత్తుల పూనకాలలతో గ్రామదేవతలైన పోషమ్మ ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించారు.



ఏటూరునాగారం: అమ్మవారి వద్దకు బయలుదేరిన భక్తులు



ఏటూరునాగారం: పోచమ్మ వద్దకు బోనాలతో వెళ్తున్న మహిళలు



వాజేడు: గుమ్మడిదొడ్డిలో..



వెంకటాపురం(కె): శివాపురంలో..



ఏటూరునాగారం: మొక్కులు సమర్పిస్తున్న భక్తులు

కోతుల దాడిలో ఇద్దరికి గాయాలు



గాయాలపాలైన పాషా

భూపాలపల్లి అర్బన్: కోతుల దాడిలో ఇద్దరు గాయాలపాలైన ఘటన జిల్లా కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. పట్టణంలోని బాంబులగడ్డ సమీపంలోని ఎస్‌కే పాషా తన ఇటుకల ప్లాంట్ వద్ద పని చేస్తుండగా, జంగేడు గ్రామానికి చెందిన దుబాసి లక్ష్మిరాజం ఇంటి ఎదుట స్నానం చేస్తుండగా కోతులు వేర్వురుగా దాడి చేయడంతో ఇద్దరు తీవ్రంగా గాయాలపాలయ్యారు. వెంటనే జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందించారు.

వీధి కుక్కల హల్‌చల్



వాజేడులోని రహదారిపై వీధి కుక్కలు

వాజేడు: మండల కేంద్రంలో వీధి కుక్కలు హల్‌చల్ చేస్తున్నాయి. మండలంలో శునకాలు విపరీతంగా పెరిగాయి. రహదారుల వెంట తిరుగుతూ పాదచారులపైకి వస్తున్నాయి. అంతే కాకుండా వాహనాలకు అడ్డు రావడంతో కింద పడిన ఘటనలు ఉన్నాయి. మండల పరిధిలోని ధర్మవరం గ్రామంలో ఇటీవల ఒక బాలుడిని, మరో వ్యక్తిని గాయపర్చాయి. కుక్కల నివారణ కోసం అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

వాజేడు: మండల పరిధిలోని లక్ష్మీపురం అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్న 15 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై రుద్రారపు హరీశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని లక్ష్మీపురం సమీప అడవిలో కొందరు పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారంతో ఆదివారం దాడులు చేశామన్నారు. ఈ దాడుల్లో సయ్యద్ సర్వర్ ఫెరోజ్, గుండెబోయిన శరత్, బొల్లె రాంబాబు, అట్టం కృష్ణమూర్తి, లొడిగె సంతోష్, వెంకటనర్సయ్య, ముత్తెబోయిన సత్యం, సూర్యనారాయణ, అవతారం, చంద్రయ్య, మోహన్‌రావు, సాంబయ్య, మల్లయ్య, భగత్, నర్సింహారావు పేకాట ఆడుతునట్లు తెలిపారు. నర్సింహారావు పరారు కాగా మిగతా వారిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై వెల్లడించారు. వారి వద్ద నుంచి పేక ముక్కలు, రూ.22,300 నగదు దొరికినట్లు వెల్లడించారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. సీఆర్‌పీఎఫ్ డీఎస్పీ సతీష్ కుమార్, సివిల్, సీఆర్‌పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు మొక్కులు



మొక్కులు చెల్లించుకుంటున్న గ్రామస్తులు

మహాముత్తారం: ప్రతీ సంవత్సరం గ్రామస్తులు శ్రావణమాసంతో గ్రామదేవతలకు మొక్కులు చెల్లించుకుంటారు. అందులో భాగంగా ఆదివారం మండలంలోని సింగారం గ్రామానికి చెందిన గ్రామస్తులు కులమాతాలకతీతంగా బాజా భజంత్రీలతో గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో గల పోచమ్మ గుడి వద్దకు వెళ్లారు. పాడి పంట సమృద్ధి చెందాలని మొక్కులు చెల్లించి అటవీ ప్రాంతంలో వన భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.